

చెహోవ్ కథ

# బాధ



**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

చీకటిపడుతున్నది. దట్టంగా కురుస్తున్న మంచులో వీధి దీపాలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి. ఇళ్ల కప్పులపైనా, వీధుల నిండా, గుర్రాలపైనా తెల్లగా పరుచుకున్న మంచు. జట్కావాలా, అయోనా పోటాపోవ్ తెల్ల దెయ్యంలాగ, కదలిక లేకుండా కూర్చున్నాడు. వంగి, శిథిలమైన శరీరంలో మంచులో కూరుకుపోతున్నాడే తప్ప, దులుపుకునే ప్రయత్నమైనా చెయ్యలేదు. జట్కా గుర్రాన్ని కూడా మంచు కప్పేసింది. యజమానిలాగే దానికీ కదలిక లేదు. బహుశా, నిశ్చల సమాధిలో ఏదో ఆలోచిస్తున్నది. పచ్చని పొలాలలో తిరుగాడాల్సిన జీవాల్ని ఈ మంచుటెడారి కబళిస్తే ఎవరిలోనైనా ఆలోచనలు సుళ్లు తిరగవా మరి.

రాని ప్రయాణీకుల కోసం జట్కావాలా, గుర్రమూ నిరీక్షిస్తున్నారు. సాయంత్రం నించి ఒక్క బేరమూ లేదు.

"ఏయ్, జట్కా."

ఓ పెద్దమనిషెవరో పిలుస్తున్నాడు.

"చెముడా? పడుకున్నావా? జట్కా కడతావా లేదా?"

వస్తున్నానంటూ ఒక్కసారి కళ్లెం లాగాడు అయోనా. గుర్రంపైనించి మంచు జలజలా కిందికి రాలింది.

పెద్దమనిషి వచ్చి జట్కాలో కూర్చున్నాడు. అవసరం లేకపోయినా, అలవాటుగా కొరడా విసిరాడు. మెడసారించి గుర్రం పరుగుతీసింది.

జట్కా అదుపులో లేదు. "ఏయ్, ఫుట్‌పాత్ మీదికొస్తున్నావేం. రోడ్డు మధ్యలో నడువు."

"ఈ ముసలాడికి జట్కా తోలటం రాదు." బగ్గీలవాళ్లు జట్కావాళ్లను చీదరగా చూస్తారు. తిట్లు. ఛీత్కారాలు.

కళ్లెం లాగుతూ, అయోనా, ఈ మాయా నగరిలో దారివెదుక్కుంటూ జట్కా తోలాడు.

"ఏయ్, వాళ్లంతా నిన్ను కావాలని ఏడిపిస్తున్నట్టుంది." అన్నాడు ప్రయాణీకుడు.

అయోనా ఏదో చెప్పాలనుకొని ప్రయాణీకుడివైపు చూశాడు. ఆ నోట్లోంచి మాటలు రాలేదు గాని ఏదో శబ్దం వెలువడింది.

"ఏమన్నావు?"

"కుర్రాడు, నా కొడుకు పోయి మూన్నాళ్లయింది."

"అయ్యో, ఎలాగ."

"ఏమో, ఎలాగో మాకేం తెలుస్తుంది. జ్వరం వచ్చి వుండాలి. మూడురోజులు ఆస్పత్రిలో వున్నాడు. అక్కడే ప్రాణాలొదిలాడు. దేవుడిలా రాశాడు."

"కళ్లు లేవురా. కాస్త చూసి జట్కా తోలు, తప్పుకో వెధవా" మళ్లీ తిట్లు.

"ఇంత నెమ్మదిగా పోతే. నేను చేరేసరికి తెల్లారుతుంది. గుర్రాన్ని పరుగెత్తించూ. కొరడాకు పనిచెప్పు."

ఒకసారి కొరడా విదిల్చి, అయోనా ప్రయాణీకుడి వైపు తిరిగాడు. ముసలాడి వాగుడు వినదలచుకోని ప్రయాణీకుడు కళ్లు మూసుకున్నాడు.

హోటల్ దగ్గర జట్కా ఆగింది. ప్రయాణీకుడు దిగిపోయాడు. కొత్త బేరంకోసం నిరీక్షణ మళ్లీ ప్రారంభమైంది. జట్కామీద, మనిషిమీద, గుర్రంమీద మంచు రాలుతూనే వుంది. ఒక గంటా... రెండూ....

నిషాలో వున్న ముగ్గురు యువకులు, అరుచుకుంటూ, పోట్లాడుకుంటూ వచ్చారు.

"పద. మా ముగ్గురికీ యిరవై కోపెక్కులిస్తాం."

అయోనా మళ్లీ కళ్లెం లాగాడు.

ఇరవై కోపెక్కులంటే చాలా తక్కువ. కాని బేరం వదులుకోలేదు. నిజానికి యిప్పుడు రూబుల్ సంపాదించినా, అయిదు కోపెక్కులు సంపాదించినా తేడా ఏమీ లేదు. బేరం కావాలి. జట్కా తిరగాలి. ఇద్దరు కూర్చోవాల్సిన జట్కాలో ముగ్గురు ఎక్కారు. ఒకడు నిలబడక తప్పదు. ఎవరు కూర్చోవాలి, ఎవరు నిలబడాలి అనే వాదన మొదలైంది. అందరికన్నా పొట్టివాడు

నిలబడాల్సిందేనని తీర్మానించారు.

"సరే" అంటూ అయోనా దగ్గిరకు వచ్చాడు పొట్టివాడు. "కొరడా చేతులో పట్టుకున్నావెందుకు. కొట్టరా. అబ్బ, ఏమి ఛండాలమైన డ్రెస్సురా బాబూ."

"నా డ్రెస్సు నాకు బాగానే వుంది" అన్నాడు అయోనా.

"గుర్రం కుంటిదా ఏం, దౌడు తీయించు. లేదా..."

"అబ్బా, తల పగిలిపోతున్నది. మందెక్కువైందిరో" అంటున్నాడొకడు.

"ఏం తాగామనిరా, ఎక్కువైందంటున్నావూ."

"నిజంగా..."

"చిన్న దొరలు మాంచి వుషారుగా వున్నారు." అన్నాడు అయోనా.

"ఒరేయ్, గుర్రాన్ని దౌడు తీయించకపోతే, నీకే రెండు తగిలిస్తాను." అంటూ కొరడా లాక్కోబోయాడు ఒకడు.

వాళ్ల తిట్లకు, అవహేళనలకు అయోనా ఏకాంతం భగ్నమైంది. పొట్టివాడి నోటినిండా పచ్చిబూతులు. ఈ పిల్ల దగ్గరకు పోవాలా? ఆ పిల్ల దగ్గరనా? ఇదెలా ఉంటుంది? అదెలా వుంటుంది? వర్ణనలు.

"మీకు తెలుసా, నా కొడుకు పోయి మూడురోజులైంది." అన్నాడు అయోనా.

"అందరం పొయ్యేవాళ్లమేలేరా. ఇది గుర్రమా? గాడిదా? అరేయ్, ఈ జట్కావాడికి ఆ నాలుగు తగిలించు, ఏమో, నకరాలు చేస్తున్నాడు..."

"వింటున్నావా? ఒక్కటిచ్చుకున్నానంటే నెత్తురుకక్కుకు చస్తావు... అరేయ్, ఈ జట్కా లాభం లేదు గాని నడుద్దాం పద.... వింటున్నావా, మేం నడిచినా, యింతకన్నా త్వరగానే పోతాం రా...."

వాళ్ల దెబ్బలకన్నా పెద్ద గాయమైంది అయోనాకు.

"ఈ చిన్న దొరలను దేవుడు చల్లగా చూడనీ."

"ఒరేయ్, జట్కా, నీకు పెళ్లైందా?" అంటూ అడిగాడొకడు.

"నాకా?" అంటూ నవ్వాడు అయోనా. "ఇక భూదేవే నా భార్య. ఆరడుగుల నేలలోనే నా కాపురం. నాయన్లారా, నా కొడుకుని పోగొట్టుకొని యింకా మిగులున్నానేను. పొరబాటు జరిగింది. నాకు బదులు వాణ్ణి తీసుకుపోయాడు దేవుడు..."

అయోనా యింకా ప్రారంభించనైనా లేదు. 'ఇంక ఆపు' అంటూ దిగిపోయారు ముగ్గురూ. ఇరవై కోపెక్కుల బిళ్లను అదుముకుంటూ, జల్సారాయుళ్లవైపు చూశాడు అయోనా.

మళ్లీ ఒంటరితనం. నిశ్శబ్దం. తిట్లో, శాపనార్థాలో మనిషి సంపర్కంలో క్షణం వుపశమనం దొరికిందనుకుంటే గుండెలను తొలచివేసే బాధ మళ్లీ ఆక్రమించుకొంటున్నది.

ఈ జన సమ్మర్థంలో ఒక్కడు, ఒక్కడంటే ఒక్కడన్నా తన గొంతు వినడా?.... కాని అయోనా బాధ ఎవరికి పట్టింది. ఆకాశమంత ఎత్తున్న పర్వతం అయోనా బాధ. లోతు తెలియని సముద్రం అయోనా బాధ.

ఆ గుండెను చీల్చుకుని రాగలిగితే అయోనా బాధ ప్రపంచాన్ని పంచేస్తుంది. అయినా అయోనా బాధ ఎవరికీ తెలియదు. ఆ జీర్ణ శరీరంలో, ఆ ముసలిగుండెలో దాగిన బాధ ఎవరికైనా ఎలా కనిపిస్తుంది.

ఎలాగైనా, ఎవరితోనైనా సంభాషణ ప్రారంభించడానికి,

"టైమెంతయింది?" అంటూ అడిగాడు గేట్ కీపర్ని.

"తొమ్మిదిన్నర ఇక్కడ నిల్చోవద్దు నువ్వు. పక్కకెళ్లు." అంటూ కసురుకున్నాడు గేట్‌కీపర్.

మరికాస్త ముందుకెళ్లి ఆపాడు అయోనా. ఆవహింపజేస్తున్న బాధ. ఎవరికి చెప్పుకోవాలనుకున్నా ఎవరూ వినరు... ఇంక లాభం లేదు. ఇప్పుడో, మరుక్షణమో గుండె పగలక తప్పదు.

"ఓయ్, గుర్రం పిల్లా, ఇటు చూడవే. ఈ జట్కా తోలాల్సిన నా కొడుకు యిప్పుడు లేడే... నా కొడుకు కుజ్మా అయోనిక్ చచ్చిపొయ్యాడు. ఒసేవ్, నీకే ఓ కొడుకుంటే, చెట్టెత్తు ఎదిగి, చేతికందిన కొడుకు ఉన్నట్టుండి ఒకనాడు చచ్చిపోతే ఎలా వుంటుందే..."

"పద" అంటూ కళ్లెం లాగాడు. అర్థం చేసుకున్న గుర్రం పరుగుతీసింది.

కాకా హోటలు దగ్గిర మురికిగా వుంది. మురికి మనుషులు. మురికి గ్లాసులు. అడ్డదిడ్డంగా, కూర్చున్న, పడుకున్న మనుషులు. వాసన.

"దాణా డబ్బులన్నా రాలేదు." అంటూ గొణుక్కున్నాడు. "నాకూ, నా గుర్రానికీ సరిపడా తిండి కూడా సంపాదించలేనప్పుడెందుకీ ప్రయాస?"

ఒకడెవడో నీళ్లు తాగటానికి అటుగా వచ్చాడు.

"దాహంగా వుందా?" అంటూ అడిగాడు అయోనా.

"కనిపించడంలేదూ."

"అవును. దాహంగా లేకపోతే నీళ్లెందుకు తాగుతాం... నీకు తెలుసా? మొన్న నా కొడుకు పోయాడు. విన్నావా? ఆస్పత్రిలో.. హోరి భగవంతుడా "

వింటున్నాడేమోనని ఆ మనిషివైపు చూస్తే వాడప్పుడే ముసుగుదన్ని పడుకున్నాడు.

ఎలాగ, ఇంకేం చెయ్యాలి?

వాడికి తాగటానికి నీళ్లు కావాలి. తనకు చెప్పుకోవటానికో మనిషి కావాలి. కొడుకుపోయి వారమైందప్పుడే. అయినా యింతవరకూ తనగోడు ఒక్కరికీ చెప్పుకోలేకపోయాడు. చెప్పాల్సిందంతా చెప్పేసి ఒక్కసారి బరువుదించుకోగలిగితే... అన్నీ చెప్పాలి? ఎలాగ వాడికి జబ్బొచ్చింది. ఎంత బాధపడ్డాడు, చివరిసారిగా వాడి నోటినుండి వచ్చిన మాటలు. ఆ ఆఖరి క్షణాలు... ఆ శవాన్ని స్మశానంలో పూడ్చేసిన వైనం... తర్వాత వాడి గుడ్డలు తెచ్చుకోవటానికి ఆస్పత్రి కెళ్లినప్పుడు... ఊళ్లో యింటి దగ్గిర కూతురుంది... ఎంత గోడు చెప్పుకోవాలో... తన బాధను విని నిట్టూర్చి, బాధపడి, ఒక్క కన్నీటిచుక్క రాల్చగలిగిన శ్రోత కావాలి. ఆడవాళ్లకు చెప్పుకుంటే బాగుంటుంది. వాళ్లైతే బాగా ఏడుస్తారు కూడాను. 'చావు' అంటూ ఒక్కమాట చెబితే చాలు. ఏడుపు లంకించుకుంటారు.

"ఒక్కసారి గుర్రాన్ని పలకరించి వచ్చి నిద్రపోవాలి చాలాసేపు" అనుకున్నాడు అయోనా.

ఒంటరిగా వున్నప్పుడు కొడుకును గురించి ఆలోచించడం మరీ కష్టంగా వుంది.

గుర్రం మొహం, మెడ తడుముతూ

"ఏం తింటున్నావే... 'అంటూ ప్రారంభించాడు', 'దాణాకు డబ్బుల్లేవు గదా, గడ్డైనా తినుమరి... వయసు మీద పడుతున్నదే... జట్కాతోలే ఓపిక ఉండటం లేదు... నన్ను యింటికాడ కూచోబెట్టి నా కొడుకు జట్కా తోలాలి అసలు. మరి వాడేమో..."

ఆలోచనల్ని నెమరేసుకుంటూ, అయోనా మళ్లీ ప్రారంభించాడు.

"ఓయ్, గుర్రం పిల్లా, ఇటు చూడవే. ఈ జట్కా తోలాల్సిన నా కొడుకు యిప్పుడు లేడే... నా కొడుకు కుజ్మా అయోనిక్ చచ్చిపొయ్యాడు. ఒసేవ్, నీకే ఓ కొడుకుంటే, చెట్టెత్తు ఎదిగి, చేతికందిన కొడుకు ఉన్నట్టుండి ఒకనాడు చచ్చిపోతే ఎలా వుంటుందే..."

యజమాని బాధను అర్థం చేసుకున్న గుర్రం నిట్టూర్చింది. అలాగ, ఆ జీవికి అయోనా తన బాధంతా వెళ్లబోసుకున్నాడు. ■